నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: మరమ్మతుల కారణంగా పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీపీడీ ఏడీఈ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అసద్ బాబానగర్ షరీఫ్ నగర్ షాగంజ్ చౌక్ తదితర ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. బహదూర్‌పురా, మురళీనగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. హుస్సేనీ ఆలం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, వీకర్ సెక్షన్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో..

జీఎంకాలనీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్ నుమా సీబీడీ ఏడీఈ తెలిపారు. సాయిబాబానగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. మేతర్వాడి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

తాళ్లగడ్డ ఫీడర్ పరిధిలో..

అఫ్జల్‌గంజ్: 11 కేవీ తాళ్లగడ్డ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అఫ్జల్‌సాగర్, అంబేడ్కర్‌నగర్ కాలనీ, అమ్లాపూర్, అన్నపూర్ణ ఆలయం 1, అన్నపూర్ణ ఆలయం 2, ఆర్య సమాజ్, అశోక్ విహార్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు. అలాగే గండి హనుమాన్ ఫీడర్ పరిధిలోని మల్లెమెట్, మహబూబ్ కాలనీ, నట్రాజ్‌నగర్, ఐస్ ఫ్యాక్టరీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు



గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ స్పోర్టింగ్ క్లబ్ ఆధ్వర్యంలో వారం రోజులుగా కొనసాగుతున్న సెకండ్ హైదరాబాద్ స్పోర్టింగ్ చాలెంజ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ.. ఫుట్‌బాల్ క్రీడను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విజేత హైదరాబాద్ గ్లోబ్ జట్టుకు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి జిపి. పుల్గన, హైదరాబాద్ గ్లోబ్ ఫుట్‌బాల్ ఇన్ కోచ్ సయ్యద్ సిద్ధిఖ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ సౌకర్యం మరింత పెంచాలి

డాక్టర్ వంశీ తిలక్
(ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యుడు)



అబిడ్స్: నుమాయిష్‌కు వచ్చే సందర్శకుల కోసం గతంలో మాదిరిగా మెట్రో రైలు మార్గం కింద, రోడ్డుకిరువైపులా పోలీసులు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యుడు డాక్టర్ వంశీ తిలక్ కోరారు. ఎగ్జిబిషన్ మైదానంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ..యేటా జనవరి 1 నుమాయిష్ ప్రారంభమై ఫిబ్రవరి 15 వరకు 46 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. అయితే సందర్శకులు తమ వాహనాలను పార్క్ చేసేందుకు జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు మొజాంజాహీ మార్కెట్ నుంచి నాంపల్లి తాజ్ ఐలాండ్ వరకు రహదారి వెంట, అలాగే భీమ్‌రావు బాడ ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసే వారని ఈ యేడు కూడా ఆయా స్థలాల్లో పార్కింగ్ సదుపాయం కల్పించాలని కోరారు.

ఇళ్ల సర్వే 80 శాతం పూర్తి

ఉపకమిషనర్ రవికుమార్

రాజేంద్రనగర్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే వార్డు సూపర్‌వైజర్లతో మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తుదారుడి వద్దకు వెళ్తున్నామని అన్నారు. వారి వద్ద నుంచి పూర్తి వివరాలను సేకరిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం 80 శాతం సర్వే పూర్తయిందని వెల్లడించారు. సర్వే సిబ్బంది సర్వే తీరును వార్డు సూపర్‌వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ప్రతిరోజు జరిగే సర్వే తీరును పరిశీలించి సూచనలు చేస్తున్నామని అన్నారు. సాధ్యమైనంత త్వరగా సర్వేను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. సర్వే సిబ్బంది, వార్డు సూపర్‌వైజర్లు సైతం అనుకున్న సమయం కంటే ముందుగా సర్వే పూర్తి చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి వద్దకు తప్పనిసరిగా వెళ్లాలన్నారు. అప్పుడే వందశాతం సర్వే పూర్తి చేయగలమని అన్నారు.

చెత్తను స్వచ్ఛ ఆటోలకే ఇవ్వాలి

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర



కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న వినయ్‌నగర్ కాలనీవాసులు



చెత్త సేకరణ తీరును పరిశీలిస్తున్న బండ్లగూడ జాగీరు కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇంట్లోని చెత్తను ప్రతి రోజు ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీరు కమిషనర్ శరత్‌చంద్ర కోరారు. మంగళవారం 14వ డివిజన్‌లోని అక్బర్‌నగర్ కాలనీ, 13వ డివిజన్‌లోని వెస్టెండ్ కాలనీ, 12వ డివిజన్‌లోని ఆనంద్‌నగర్ కాలనీలలో చెత్త సేకరణ తీరును ఆయన నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతగా భావించాలన్నారు. ఇంట్లోని చెత్తను రోడ్లకు ఇరువైపుల, ఖాళీ ప్రదేశాల్లో వేయొద్దని కోరారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా భద్రపరిచి ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు రామంజులు, సుభాష్, సురేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వినాయక్‌నగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కాలనీ అధ్యక్షుడు మురళీకృష్ణ అధికారులను కోరారు. మంగళవారం కమిషనర్ శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. సరైన డ్రైనేజీలు లేక మురుగు రోడ్లపై ప్రవహిస్తోందని తెలిపానన్నారు. స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరానన్నారు. త్వరలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ నాయకులు సి.బాబు, కృష్ణ, శ్రావణ్, సందీప్, రామంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మాంసం వ్యర్థాల తరలింపు వేలం పూర్తి



మాట్లాడుతున్న బండ్లగూడ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: మాంసం దుకాణాల నిర్వాహకులు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా చూసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం చికెన్, మటన్, ఫిష్ వ్యర్థాలను సేకరించి తరలించేందుకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. మెరైన్ ఫుడ్స్ అండ్ ఫీడ్ సంస్థ వేలం పాటలో దక్కించుకున్నట్లు తెలిపారు. రూ.1.19 లక్షలకు వేలం దక్కించుకున్నారని పేర్కొన్నారు. ఫిబ్రవరి 2025 నుంచి జనవరి 2028 (36 నెలలు) వరకు కొనసాగుతుందన్నారు. వేలం దక్కించుకున్న నిర్వాహకులు ఏడాదికి రూ.1.19లక్షలు చెల్లిస్తారని తెలిపారు. దుకాణాల నిర్వాహకుల నుంచి వ్యర్థాలను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలిస్తారని అన్నారు. దీనికి మాంసం దుకాణాల నిర్వాహకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఈ.మంజులత, డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో షబ్-ఏ-మేరాజ్

శాలిబండ: శాలిబండ ఖాజీపురాలోని నవ ఈద్ మసీద్‌లో సోమవారం రాత్రి షబ్-ఏ-మేరాజ్ ప్రార్థనలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మౌలానా సాజిద్ షబ్-ఏ-మేరాజ్ ప్రత్యేకతలను వివరించారు. ఈ సందర్భంగా సాజిద్ మాట్లాడుతూ.. షబ్-ఏ-మేరాజ్ ముస్లింలకు పవిత్రమైన రాత్రిగా గుర్తించబడుతుందన్నారు. ఈ దివ్య రాత్రిలో ప్రత్యేక నమాజ్‌లు, ఖురాన్ పఠనం, దువాలు చేయడం లాంటివి ముస్లింలు పాటించారు. ఈ రాత్రి అల్లాహ్ కరుణను పొందే సందర్భంగా ముస్లిం సోదరులు, పెద్దలు, పిల్లలు పెద్ద సంఖ్యలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యారు.



షబ్-ఏ-మేరాజ్ ప్రత్యేకతలను వివరిస్తున్న మౌలానా సాజిద్

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న పి.హరినాథ్‌రెడ్డి, కార్యదర్శి రంగారెడ్డి

అబిడ్స్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని సర్దార్ పటేల్ కళాశాల చైర్మన్ పి.హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ సర్దార్‌పటేల్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తమ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కళాశాల కార్యదర్శి రంగారెడ్డి మాట్లాడుతూ.. నగరంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని, నిబంధనలు పాటిస్తేనే సమస్యను పరిష్కరించవచ్చన్నారు. ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్ సి.రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులతో పాటు ఇతరులు కూడా ట్రాఫిక్ నిబంధనలను పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ ఎస్.సంపత్‌కుమార్, సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆర్‌టీఓ ఎస్‌వై.స్వామి తదితరులు పాల్గొన్నారు.

చెస్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో నిర్వాహకులు

చార్మినార్: ఏపీజే అబ్దుల్ కలాం ఆజాద్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాతబస్తీ ఉర్దూఘర్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా రిపబ్లిక్ డే స్కూల్ చెస్ టోర్నీ–2025 విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. గోల్కొండలోని కేంద్రీయ విద్యాలయానికి చెందిన ఎం.విద్యాధర్ ప్రథమ బహుమతి సాధించారు. అలాగే నాచారంలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన మహమ్మద్ షబ్బీర్ అహ్మద్, తాహెర్ మునీర్, మంగలపల్లి శశిధర్, మహ్మద్ సాహిర్ అహ్మద్, హరీశ్ తర్వాత స్థానాల్లో నిలిచారు. వీరికి సంఘం చైర్మన్ డాక్టర్ సమద్ ఉస్మానీ, కార్యనిర్వాహక కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రీతో పాటు సిరాజుద్దీన్ తదితరులు బహుమతులతో పాటు మెమెంటోలు అందజేశారు.

పరిషత్ కృషి అభినందనీయం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హరికృష్ణ తదితరులు

సుల్తాన్‌బజార్: 1993 నుంచి ప్రసంగ వ్యాసాలను 11 సంపుటాలుగా వెలువరించేందుకు పరిషత్ చేస్తున్న కృషి అభినందనీయమని హరికృష్ణ పేర్కొన్నారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ ఎప్పుడూ కొత్తదనం కోసం తపించే పరిషత్ నాటి అధ్యక్షుడు జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి ప్రారంభించిన తెలుగు భాషా సాహితీ ప్రముఖుల స్ఫూర్తిదాయక ప్రసంగాల కార్యక్రమాన్ని కొనసాగిస్తూ పుస్తక రూపంలోనూ అందిస్తున్నామని తెలిపారు. ఇటీవలి కాలంలో పరిణతవాణి ప్రసంగాలు చేసిన ప్రముఖ కవి రచయితలు డాక్టర్ పురుషోత్తమాచార్య, శీలా సుభద్రాదేవి, జూపాక సుభద్ర స్వాతి శ్రీపాద, వై.ముకుంద రామారావు, డాక్టర్ జి.చెన్నకేశవరెడ్డి విశిష్ట అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతోపన్యాసం చేశారు. ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సిల్మా నాయక్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

నుమాయిష్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు



ముఖైర్ హైదర్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

అబిడ్స్: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను తిలకించేందుకు వస్తున్న సందర్శకులకు కనువిందు చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ కల్చరల్ ప్రోగ్రామ్స్ సబ్ కమిటీ కన్వీనర్ ముఖైర్ హైదర్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో లయన్స్ డే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కన్వీనర్ ముఖైర్ హైదర్‌ను లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు సత్కరించారు. అనంతరం ముఖైర్ హైదర్ మాట్లాడుతూ.. సందర్శకులను అలరించేందుకు నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బాబురావు, సునీల్‌కుమార్, దీపక్, ఎస్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు చలనచిత్ర నాటక రంగ అభివృద్ధి సంస్థల సహకారంతో వంశీమిత్ర నాట్యమండలి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన భక్త చింతామణి, సత్య హరిశ్చంద్రీయం నాటకాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారులు పదునైన సంభాషణలు, ఆసక్తికర సన్నివేశాలతో ఆయా పాత్రలకు జీవం పోశారు. కార్యక్రమంలో సీహెచ్ శులాపాణి, న్యాయవాదులు పొన్నం శ్రీనివాసరావు, వీఆర్.కోటి, సి.బాలకృష్ణ, రంగస్థల నటీమణి పెమ్మరాజు సావిత్రి, సంస్థ కార్యదర్శి వెంకటాచార్యులు పాల్గొన్నారు.



'వెయ్యి గొంతులు-లక్ష డప్పులు' ను జయప్రదం చేయండి



హైకోర్టు గేట్ వద్ద డప్పులతో ప్రదర్శన నిర్వహిస్తున్న లాయర్లు



డప్పులతో దరువు వేస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు

చార్మినార్: వచ్చే నెల 7న నిర్వహించనున్న 'వెయ్యి గొంతులు–లక్ష డప్పులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బహదూర్‌పురా నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఎస్పీనగర్, ఎన్‌ఎంగూడ తదితర బస్తీల్లో మంగళవారం రాత్రి డప్పులతో దరువు వేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్.నర్సింగ్‌రావు, ఎస్పీ విజయ్‌కుమార్, జగదీష్, ఏర్పుల విష్ణు, చిన్నగండ్ల ప్రమీల, తుంపలిల్ల చెన్నయ్య, నాగపాగుల రవి, యాదశి నర్సింగ్‌రావు, ఎ.కృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు వద్ద డప్పులతో లాయర్ల ప్రదర్శన..

చార్మినార్: తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు, హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యుల సంఘీభావంతో మాదిగ లాయర్స్ ఫెడరేషన్ (ఎంఎల్ఎఫ్) ఆధ్వర్యంలో హైకోర్టు 4వ గేట్ వద్ద లాయర్లు మంగళవారం డప్పులతో ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వచ్చే నెల 7న నిర్వహించే 'వెయ్యిగొంతులు–లక్ష డప్పులు' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకే ఈ ప్రదర్శన నిర్వహించామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమంలో కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

నేషనల్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక



నేషనల్ పోటీలకు ఎంపికైన బాక్సర్లు

గోల్కొండ: ఈనెల 31 నుంచి ఉత్తరఖండ్‌లో ప్రారంభం కానున్న 38వ నేషనల్ గేమ్స్‌కు షేక్‌పేట్‌కు చెందిన ఇద్దరు బాక్సర్లు ఎంపికైనట్లు షేక్‌పేట్ ఇండోర్ స్టేడియం బాక్సింగ్ కోచ్ శివకుమార్ తెలిపారు. స్టేడియంలో మంగళవారం వారిని సన్మానించి పోటీలకు పంపారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ.. ఎలిట్ పురుషుల విభాగంలో పవన్ కల్యాణ్ 60–63.5 కేజీల విభాగంలో, ఎలిట్ మహిళా విభాగంలో 52–60 కేజీల విభాగంలో మహిళా బాక్సర్ సి.అపర్ణ పోటీపడనున్నట్లు తెలిపారు. తనతో పాటు పి.వినేశ్‌బాబు కోచింగ్ ఇచ్చారని పేర్కొన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడి అరెస్టు

నాంపల్లి: అనుమానాస్పద స్థితిలో సంచరిస్తున్న ఓ పాత నేరస్తుడిని జీఆర్పీ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 56 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రైల్వే డీఎస్పీ ఎస్.ఎన్.జావేద్ హైదరాబాద్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్‌తో కలిసి దొంగతనానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఖైరతాబాద్ ఎంఎస్ మక్తాకు చెందిన మహ్మద్ యూసుఫ్ ఘోరీ ఫతేనగర్ ఫ్లైఓవర్ కింద సోఫా వర్క్స్ చేస్తుంటాడు. జల్సాలకు అలవాటుపడిన ఇతను రైళ్లు, రైల్వే స్టేషన్లలో దొంగతనాలకు పాల్పడుతున్నాడు.

మంగళవారం హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారం–4 మీద తచ్చాడుతూ కనిపించాడు. అనుమానాస్పద స్థితిలో ఉన్న అతడిని జీఆర్పీ పోలీసులు సోదా చేయగా..ఓ బ్యాగులో 56 గ్రాముల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్ లభించాయి. విచారణలో దొంగతనం చేసినట్లుగా నిందితుడు ఒప్పుకోవడంతో మహ్మద్ యూసుఫ్ ఘోరీని అరెస్టు చేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ మెరాజ్‌కాలనీలోని తన కార్యాలయంలో మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్వాన్, లంగర్‌హౌస్, టోలిచౌకీ, గోల్కొండ తదితర ప్రాంతాల నుంచి మహిళలతో పాటు పలు కుటుంబ సభ్యులు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఆసరా పింఛన్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుంటే ఇప్పటివరకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందిస్తూ కొన్ని దరఖాస్తులనే అధికారులు సర్వే కోసం ఎంపిక చేశారని, అలాగే రేషన్ కార్డులు, పింఛన్లు సర్వే కొనసాగుతుందని అర్హులందరికీ అందుతాయని ఆందోళన చెందవద్దని సూచించారు. త్వరలోనే రెవెన్యూ, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పెండింగ్ దరఖాస్తుల విషయమై చర్చిస్తానని హామీ నిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు రఫత్‌హుస్సేన్, ఆలీముద్దీన్ తదితరులు ఉన్నారు.

'ఐఎంఎస్ క్రిసలీస్ డే ఎగ్జిబిషన్-2025' షురూ



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మొహమ్మద్ ముస్తఫా తదితరులు



నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

జియాగూడ: జియాగూడలోని ఇంద్రాణి మహా విద్యాలయ్‌లో స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.మిథిలేశ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'ఐఎంఎస్ క్రిసలీస్ డే ఎగ్జిబిషన్–2025 కార్యక్రమానికి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ మహ్మద్ ముస్తాఫా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ ఫుడ్‌తో ఆరోగ్యం డైజెస్టివ్ ట్రాక్, ఓటింగ్ డే, సైమెంట్రీ ఐఎంఎస్ టైం లైవ్ ట్రాక్ స్కూల్ జర్నీ, గ్రామర్, శివాజీ చరిత్ర, ఆర్గానిక్ వ్యవసాయం తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ట్రస్మా వర్కింగ్ ప్రెసిడెంట్ గాలయ్య, ఆసిఫ్‌నగర్ మండల్ ట్రస్మా అధ్యక్షుడు రవికుమార్, క్రిసలీస్ రీజినల్ మేనేజర్ గులాం, ట్రైనర్ అంకిత సేన్, వైస్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, హెచ్‌ఓడీ ఇంద్రాణి, క్రిసలీస్ కో ఆర్డినేటర్స్ ప్రియాన్షి శ్రీవాస్తవ, శ్వేతా, మీనాక్షి, అర్చన పాల్గొన్నారు.

హెబ్రోన్ చర్చి వివాదాలకు ముగింపు పలకాలి



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్‌రాజ్

ముషీరాబాద్: హెబ్రోన్ చర్చిలో ఇరువర్గాల వివాదాల వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతుండడంతో పాటు క్రైస్తవుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, వెంటనే ముగింపు పలకాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌రాజ్ అన్నారు. భోలక్‌పూర్ డివిజన్ సంజీవయ్యనగర్‌లో పలు రాజకీయ పార్టీల నేతలు, క్రైస్తవ పెద్దలతో కలిసి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వర్గాల గొడవల్ల వల్ల చర్చి ప్రతిష్ట దెబ్బతింటున్నదని ప్రభుత్వం వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలోనే వివిధ రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మహ్మద్ ఎజాజ్, తెలంగాణ క్రిస్టియన్స్ సంఘం కార్యదర్శి దాస్ పాల్గొన్నారు.